ప్రిది ఒక పల్లెటూరు. ఆ ఊళ్ళో సుమారు రెండు వందలగడపలుంటుంది. అది సాయంకాలం. సూర్యుడు అస్తమిస్తున్నాడు. పక్షులు కిలకిలా రావాలు చేస్తూ తమగూళ్ళకి చేరుకుంటున్నాయ్. కర్షకులు దినమెల్లపడిన కష్టాన్ని మరిచిపోయి హృదయాలకి హాయినికల్పించే జానపదగీతములని గానంచేస్తూ తమతమ యిండ్లకు పోతున్నారు.

గోకుల్ అప్పుడే ఆ గ్రామం చేరుకున్నాడు. దూరం నడవడంచేత కాబోలు శరీరమంతటా చెమట్లు క్రమ్మాయి. ఆ గ్రామానికొతడు నూతనుడు కావటంచేత తన గమ్యస్థానాన్ని సులభంగా గుర్తింపటానికి సావకాశంలేదు. అపుడపుడే కారుచీకట్లు క్రమ్ముతున్నాయి. గోకుల్ అటుపోతూన్న ఓ కుర్రాణ్ణిపిలిచి "సూరన్నగారి ఇల్లెక్కడ?" అని ప్రశ్నించి తన గమ్యస్థానమును తెలుసుకొన్నాడు. ఆకుర్రవాడుచూపిన యింటిదగ్గరకుపోయి తలుపు తట్టాడు. శ్యామల తలుపుతీసింది. ఎదుట ... గోకుల్ ... "గోకుల్ ... వచ్చావా ... రా లోపలికిరా ... కూర్చో ... మంచినీళ్ళుకావాలా?' మొదలైనవన్నీ అయ్యాయి. మరో అరగంటకు సూరన్నపంతులు పొలంనుంచివచ్చాడు. వస్తూనే గోకుల్ని చూచేసరికి ... వళ్ళు మండిపోయింది ... ఉగ్రమూర్తయ్యాడు... కాని పైకి యేమీ అనలేదు. ఇంతలో శ్యామల, సూరన్న పంతులునుద్దేశించి "గోకుల్ వచ్చాడండీ" అంది. దానికి సమాధానంగా "ఊఁ" అని పైకిఅని "గోకుల్ గీకుల్ ... మళ్ళీయెందులకు యిక్కడికితయారు..." అని లోపల తిట్టుకొంటూ దొడ్లోకి వెళ్ళిపోయాడు. సూరన్న నడవడికను గోకుల్ లక్ష్యపెట్టలేదు. తాను శ్యామలను ... చూచిపోవాలని వచ్చాడుకాని ... సూరన్నని చూడ్డానికి రాలేదుగా! అని తృప్తిపడ్డాడు.

శ్యామల పట్నంలో రామారావుగారికొమార్తె. రామారావుగారు తాలూకా ఆఫీసులో గుమాస్తాగిరీ చేస్తున్నారు. సామాన్య కుటుంబీకులు. వీళ్ళ యింటిప్రక్కనే వుంటూన్న కాలేజీలో లెక్చరరుగారైన నారాయణరావుగారి కొడుకు గోకుల్. అందంగా వుంటాడు. మంచి తెలివైనవాడు. శ్యామల అందంగా వుంటుంది. చలాకీగా వుంటుంది. శ్యామలాగోకుల్లు చిన్నప్పటినుంచీ యెంతో స్నేహంగా వుండేవారు. వారు పెద్దవారయ్యేసరికి వారి హృదయాలలో అనిర్వచనీయమైన భావాలు మొలకలెత్తాయి... యిన్నిమాటలెందుకు—వారిద్దరు గాఢంగా ప్రేమించుకొన్నారు. వారిరువురి ప్రేమలతా పెరిగి ... చిగురించి ... మొగ్గలుతొడిగి ... పువ్వులు పూయబోయేసమయంలో ఓ తుపానువచ్చి ఆ లతని కూకటివ్రేళ్ళతో పెకలించివేసింది.

శ్యామలకు చాలా సంబంధాలుచూశారు. ఆఖరుకు పల్లెటూరు మృగమైన సూరన్నకు రెండో పెళ్ళివాడైనా కాస్త కొంప ... వుందికదా అని ముడెట్టారు. దాంతోటి గోకుల్శ్యామలల ప్రేమ

# అశ్రుకణాలు

లత నాశమైపోయింది. వారిద్దరూ యేంచేయగలరు? ఇద్దరూ కుమిలి ... కుమిలి... కళ్ళు కాయలుకాచేటట్లు యేడ్చారు. కాని ఫలితం యేముంది. వివాహమైనతరువాత కార్యంకూడా అయిందనిపించి అత్తవారింటికి పంపారు. సంఘంలో జరిగే దురన్యాయాలు ... సంఘటనలు యెన్నో! రెండో పెళ్ళివాళ్లయినా...ఏభయ్యో పడిదాటి అరవయ్యో పడి వస్తున్నా...యీ ముసలాళ్లకి మరలా పెళ్ళెందుకు? ... యౌవనంలోవున్న కన్యకల మెళ్ళో పుస్తెకట్టి ... వాళ్ళని అనుమానిస్తూ ... అదుపాజ్ఞల్లో పెట్టి ... వాళ్ళని యేడిపిస్తూ... తాము యేడుస్తూ ... పెద్దమనుష్యులమని ఘరానాగా తిరిగే మనుష్యులెంతమందిలేరీ గుడ్డిసంఘంలో ...

శ్యామల కాపరానికివెళ్ళి అప్పుడే ఆరునెలలు కావచ్చింది. కాలచక్రం గిర్రునతిరిగింది... అప్పుడే

ఆరుమాసాలు కాలవాహినిలో కొట్టుకపోయాయి. శ్యామలమీద నిరాశ చేసుకొన్నా ... ఒకసారి చూడాలని కోరికజనించింది. ఇకమీదట ఆమెని తన సోదరిగా భావించవలెనని నిశ్చయించుకొన్నాడు ... ఇప్పుడామె సూరన్నకి భార్య అయినది కాబట్టి శ్యామల భర్తతో కాపురంచేస్తూన్న గ్రామానికి ప్రయాణమైవెళ్ళాడు గోకుల్.

రాత్రి భోజనాలదగ్గర సంభాషణ యేమీజరగలేదు. ఎవరితన్న వారే ... భోజనంముగించి యివతల పడ్డారు. భోజనాలదగ్గర శ్యామల గోకుల్‌ని 'అన్నయ్యా' అని సంబోధించింది. కాని అనుమాన పిశాచంచే ఆవరింపబడిన సూరన్నపంతులు యెట్లా గ్రహిస్తాడా నిర్మలుల అభిప్రాయాన్ని ...

శ్రీ. ఎ. వెంకటు
* మాణిక్యాలరావు

తెల్లవారింది. గోకుల్ కాలకృత్యాలు తీర్చుకొనే నిమిత్తం చెరువుగట్టుకుపోయి వచ్చాడు. ఆ దృశ్యం ... చూసేసరికి ... నిశ్చేష్టుడయ్యాడు. సూరన్న శ్యామల జుట్టుపట్టుకొని ... వంగతీసి "ఏం రంకుముండా! మీ వూళ్ళో చాలకనా యింకా ... యిక్కడికి వుత్తరాలురాసి రప్పించావు" అని తిట్టుతూ తనహృదయంలోని కుళ్ళును ... అనుమానాన్ని వెడలగ్రక్కుతూ ... శ్యామలని చావబాదుతున్నాడు. ఆమె "అబ్బే లేదండీ, వూరికే చూసి వెడదామని వచ్చాడు పాపం" అంటూ జవాబు చెప్పతున్నా వినక ఆమెను కొట్టుతున్నాడు. సూరన్న ప్రయోగించిన దెబ్బలకంటె పలుకులు ములుకుల్లాగ ఆమె హృదయాన్ని దూసుకుపోయాయి ... ఆమె హృదయంలో గింగురుమని మ్రోగి ప్రతిధ్వనించాయా మాటలు.

గోకుల్‌ను చూడటంతోనే సూరన్న మాట్లాడకుండా చడీచప్పుడు లేకుండా దొడ్లోకి దారి తీశాడు. శ్యామల యేమీ యెరగనట్టు కళ్ళుతుడుచుకొని "ఏం గోకుల్ యింత ఆలస్యంచేశావేం? ఇదిగో కాఫీకాయటం అయిపోయింది ... తెస్తున్నా" అని లోపలికి వెళ్ళింది. గోకుల్ బుర్రలో అనేకవేల రైళ్ళు పరిగెడుతున్నాయ్. ఈ భూమిఅంతా గిర్రున తిరుగుతున్నట్లయ్యింది అతనికి. బుర్ర ఆలోచనలతో నిండిపోయింది. శ్యామల ... ఎన్నితిట్లు ... దెబ్బలు తింది భర్తచేత... కారణం? తనరాక. తను రాకపోయినచో యే గొడవాలేకపోవునా! అందుచేత తన ప్రథమకర్తవ్యం తక్షణం అక్కడనుండి ... వెళ్ళిపోవటం ...

శ్యామల కాఫీ కాయడంలో నిమగ్నురాలై వుంది. గోకుల్ వాకిట్లో వున్న తన తోలుసూట్కేసులో బట్టలుసర్ది ... సూటుకేసు చేత్తో పుచ్చుకొని ... గబగబా ...యెవరితోనూ చెప్పకుండా... వీధిలోకి నడచి ... సందుమళ్ళాడు. శ్యామల కాఫీ పట్టుకొనివచ్చి చూసేసరికి గోకుల్ వాకిట్లో కనిపించలేదు. వీధి అరుగుమీద చూస్తే అక్కడా ... లేదు. దొడ్లోకి వెళ్ళిచూస్తే సూరన్నమాత్రం ఆవుదగ్గిర వున్నాడు. భర్తని "గోకుల్ యేడండీ? కాఫీ చల్లారిపోతుంది" అని అడిగింది. "ఏమో, యెవరికి తెలుసు" అని జవాబిచ్చాడు సూరన్న. శ్యామలకేమీ పాలుపోలేదు. మరలా వీధిలోచూస్తే అక్కడాలేదు. హఠాత్తుగా ఆమెకో ఆలోచనతట్టి మంచంకింద అతని ... సూటుకేసుకోసం చూసింది. కాని అది అక్కడలేదు. అదృశ్యమైంది. తక్షణం ఆమె కళ్ళవెంబడి రెండు వేడి నీటిచుక్కలు కాఫీ గ్లాసులో అప్రయత్నంగా రాలాయి. ఆ రెండు అశ్రు కణాలతోపాటూ "గోకుల్ ... నాతోనైనా చెప్పకుండా వెళ్ళిపోయావా!" అన్నమాటలుకూడా వెలువడ్డాయి ఆమెనోటి వెంబడినుంచి ...